

# అమ్మ ప్రేమ

**దేశం** కోసం యుద్ధంలో పోరాడి ప్రాణాలు అర్పించేవారు మాత్రమే వీరులు కాదు. విధి నిర్వహణలో భాగంగా అసువులుబాసే ప్రతి సైనికుడూ అమరుడే. అలాంటి వ్యక్తే అభిమన్యు. పేరుకు తగ్గట్టు ఆ యువకుడు సాహసికుడు. కోరికోరి వైమానిక దళంలో చేరాడు. డెహ్రాడూన్‌కి చెందిన అభిమన్యు, హైదరాబాద్ దుండిగల్‌లోని ఎయిర్ ఫోర్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న సమయంలో... తను నడుపుతున్న విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. క్షణాల్లో కుప్పకూలిపోయింది. ఆ ప్రమాదంలో అభి అసువులుబాసాడు. అభిమన్యు మరణాన్ని జీర్ణించుకోలేకపోయారు అతని తల్లి చిత్రలేఖ. బిడ్డ జ్ఞాపకార్థం ఏదైనా చేయాలనుకున్నారు. విమానం కూలిపోయిన ప్రదేశంలోనే ఓ స్థూపాన్ని నిర్మించారు. అభిమన్యు 33వ పుట్టినరోజు సందర్భంగా దాన్ని ఆవిష్కరించారు. అంతేకాదు. యూనిఫాంలో ఉన్న కొడుకు రూపాన్ని తన చేతిమీద టాటూగా వేయించుకున్నారు. ఆ ప్రమాదంలో అభిమన్యుతో పాటు ఓ వియత్నాం సైనికుడు కూడా చనిపోయాడు. ఆ దేశానికి వెళ్లి అమరుడైన సైనికుడి తల్లిదండ్రులను కలవాలని చిత్రలేఖ ఆలోచన. అమ్మ ప్రేమలోని చిక్కదనానికి సాక్ష్యం ఈ సంఘటన.

నమస్తే తెలంగాణ

జిందగీ II

హైదరాబాద్ | గురువారం 15 ఫిబ్రవరి 2024 www.ntnews.com

Fashion



## అమ్మాయి పేరు.. వర్ష


వర్ష బొల్లమ్మ .. 'చూసీ చూడంగానే' తెలుగువారికి నచ్చేసింది. ఇంకేముంది, అభిమాన వర్షం మొదలైంది. ఆటోగ్రాఫ్‌లు, సెల్ఫీల దాడులు తప్పించుకోడానికి ఈ కొడగు సుందరి గొడుగు చాటున సంచరించాల్సిన పరిస్థితి వచ్చింది. 'ఊరు పేరు భైరవకోన' తన తాజా చిత్రం. వర్ష కథానాయిక అయితే.. డైలాగ్ రైటర్స్‌కు పెద్దగా పనే ఉండదు. కళ్లతోనే సంభాషణలు పలికించగలదు.

📷 సి.ఎం. ప్రవీణ్



ఇంటీరియర్ డెకొరేషన్ విలాసవంతంగానే ఉండాలని కోరుకునే వారి సంఖ్య పెరుగుతున్నది. దుస్తులు, కార్లు, కాస్మెటిక్స్‌లాగే వీటిలోనూ 'ఇంపోర్టెడ్' ముద్ర కోసం ఆరాటపడుతున్నారు. అలాంటి వారికోసం లగ్జరీ ఇంటీరియర్ వస్తువుల్ని అందించేందుకు 'మైసన్ సియా' పేరిట ఒక బ్రాండ్‌ను సృష్టించారు ముంబయికి చెందిన వ్రతిక అగర్వాల్. ఈ మధ్యే దాన్ని హైదరాబాద్‌కూ విస్తరించారు. ఫ్యాషన్ డిజైనర్‌గా పద్నాలుగేండ్లు పనిచేసిన తాను ఇంటీరియర్ డిజైనింగ్ వైపు ఎలా అడుగులు వేసిందీ 'జిందగీ'తో పంచుకున్నారిలా...

# సృజన.. నా మూలధనం!



**మాది** ఉత్తరప్రదేశ్. అక్కడి సహారన్‌పూర్‌లో నేను పెరిగాను. నాన్న వ్యాపారం చేసేవారు. అమ్మ పెండ్లికి ముందు పైలట్. తర్వాత ఇంటి బాధ్యతలు చూసుకునేది. నాన్నను చూస్తూ పెరిగాను కాబట్టి కస్టమర్లతో ఎలా వ్యవహరించాలి, వ్యాపారాన్ని ఎలా నడపాలన్నది సులభంగానే అర్థమైపోయింది. నాకు ఏ పనైనా సృజనాత్మకంగా చేయడం ఇష్టం. ఏ వ్యాపారానికైనా అదే అసలైన పెట్టుబడి. ఆ సృజనకు అధ్యయనం తోడుకావాలి. అందుకే, పెద్ద చదువుల కోసం ఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీని ఎంచుకున్నాను. పోస్ట్ గ్రాడ్యుయేషన్ కూడా చేశాను. ఢిల్లీలోనే కొన్ని ప్రసిద్ధ సంస్థలతో కలిసి పనిచేశాను. పెండ్లి తర్వాత ముంబై వచ్చాను. ఇక్కడ మనీశ్ మల్హోత్రా, రేణు టండన్, అంజు మోదీలాంటి బ్రాండ్లలో ఫ్యాషన్ డిజైనర్‌గా పనిచేశాను. తొలి నుంచీ సొంతంగా ఒక బ్రాండ్ పెట్టాలన్న ఆలోచన ఉండేది. మా వారు నకుల్ అగర్వాల్‌ది కూడా వ్యాపార నేపథ్యమే. నేను సొంతంగా బిజినెస్ ప్రారంభిస్తానంటే ఆయన ప్రోత్సహించారు. నాకంటూ ఒక గుర్తింపు ఉండటం మంచిది అని చెప్పారు. దీంతో, 2012లో 'టూ వైట్ బర్డ్స్' పేరిట దుస్తుల బ్రాండ్ ఏర్పాటు చేశాను. ఇండియన్, వెస్టర్న్ డిజైన్ల ఫ్యూజన్‌గా డ్రెస్‌లను డిజైన్ చేశాను. అలా మొత్తంగా 14 ఏండ్లు ఫ్యాషన్ డిజైనింగ్ రంగంలో పనిచేశాను.



### అదే మలుపు

ఇలా పనిచేస్తూనే ముంబయిలోని మా కొత్త ఇంటి డిజైనింగ్ పనీ చూసేదాన్ని. మా కలల సౌధాన్ని అందంగా అలంకరించడానికి మంచి ఆర్ట్‌పీస్‌లు, హోమ్‌డెకార్ ఎక్కడ దొరుకుతాయా అని వెతికేదాన్ని. ఇటాలియన్, ఫ్రెంచ్, అమెరికన్... ఇలా ఒక్కో బ్రాండ్‌కు సంబంధించిన వస్తువు ఒక్కో చోట దొరికేది. కార్లు, కాస్మెటిక్స్, దుస్తులు భారత్‌లో దొరికినట్టుగా ఈ హోమ్‌డెకార్‌లను అమ్మే బ్రాండ్స్ నాకెక్కడా కనిపించలేదు. దీంతో నేను మా ఇంటిని డిజైన్ చేసుకోవడానికి ప్రపంచమంతా చుట్టాల్సి వచ్చింది. కానీ నాలాగే విలాసవంతమైన ఇంటి అలంకరణ సామగ్రిని ఇష్టపడేవాళ్లు ముంబైలో చాలా మంది ఉన్నారు. వాళ్లకు కూడా వీటిని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో 2022లో 'మైసన్ సియా' స్థాపించాను. ఖరీదైన విదేశీ బ్రాండ్ల గృహాలంకరణ సామగ్రి అంతా మా స్టోర్స్‌లో అందుబాటులో ఉంటుంది. లేకపోయినా, ఆర్డర్ మీద తెప్పిస్తాను. పారిస్‌కు చెందిన కళాకారిణి కర్తిని థామస్, డచ్ డిజైనర్ మార్సెల్ వాండర్స్, ఫ్రాన్స్‌కి చెందిన ప్రముఖ ఆర్టిస్ట్ అతీనా జహంతీ లాంటి వాళ్లతోపాటు అనేక డిజైనింగ్ హౌస్‌లకు చెందిన కళారూపాలు ఉంటాయిక్కడ. హైదరాబాద్ నవాబుల నగరం. విలాసవంతుల చిరునామా. ఇక్కడి ప్రజల టేస్ట్ చాలా రిచ్. ఈ తరహా అలంకరణలను హైదరాబాదీలు ఇష్టపడతారని నేను దగ్గరనుంచి గమనించాను. అందుకే మా రెండో బ్రాంచ్ ఇక్కడే నెలకొల్పాం. త్వరలోనే కస్టమైజ్డ్ ఫర్నిచర్, ప్లేజోన్‌ల రంగంలో కూడా అడుగు పెడుతున్నాం. మరింత మందికి మా సేవలు అందించేందుకు ఇతర నగరాల్లోనూ స్టోర్లు తెరిచే ఆలోచనలో ఉన్నాం.





### అదో సవాలు

**నాకు** ముగ్గురు పిల్లలు. అందరూ ఐదేండ్ల లోపువాళ్లే. నా కెరీర్‌లో ఏదైనా సవాలు ఉందంటే వాళ్లను చూసుకుంటూ వ్యాపారం నిర్వహించడమే. మా అమ్మ తొలితరం పైలట్లలో ఒకరు. కానీ ఇంటి కోసం కెరీర్ వదిలేశారు. అలా కాకుండా ఇంటినీ కెరీర్‌నీ చూసుకుంటూ ముందుకెళ్లమని ఆమె ఎప్పుడూ నన్ను ప్రోత్సహిస్తారు. ఆడవాళ్లకు అమ్మతనం అన్నది వరమే కాదు, కెరీర్ పరంగా సవాలు కూడా. కానీ ఈతరం మహిళ రెండిటినీ సమన్వయం చేసుకోగలదు. రెండు బాధ్యతల్లోనూ విజయం సాధించగలదు. నేను అదే తోవలో ఉన్నాను.

... లక్ష్మీహరిత ఇంద్రగంటి



## చికెన్ కీమా శాండ్‌విచ్

కిచెన్ మంత్ర

### కావలసిన పదార్థాలు

**చికెన్ కీమా:** ఒక కప్పు, **బ్రెడ్ ముక్కలు:** ఆరు, **నూనె:** ఒక టేబుల్ స్పూన్, **ధనియాల పొడి:** ఒక టీస్పూన్, **కారం:** ఒక టీస్పూన్, **ఉప్పు:** తగినంత, **గరం మసాలా:** ఒక టీస్పూన్, **ఉల్లిగడ్డ తరుగు:** ఒక కప్పు, **చీజ్‌స్లైస్‌లు:** మూడు, **చిల్లీ సాస్:** ఒక టీస్పూన్.

### తయారీ విధానం

ముందుగా ఒక గిన్నెలో నూనె వేడి చేయాలి. అందులో ఉల్లిగడ్డ తరుగు వేయించాక, చికెన్ కీమా వేసి ఐదు నిమిషాలు మగ్గనివ్వాలి. తర్వాత కారం, ధనియాల పొడి, గరం మసాలా, ఉప్పు కలపాలి. రెండు నిమిషాల తర్వాత చిల్లీ సాస్ తోపాటు కొన్ని నీళ్లు పోసి మంట ఎక్కువ చేయాలి. మిశ్రమంలో నీరంతా ఆవిరయ్యాక దింపేయాలి. ఆపైన టోస్ట్ చేసుకున్న బ్రెడ్ ముక్కపై చీజ్ స్లైస్ పెట్టాలి, దానిపై చికెన్ కీమా వేయాలి. మరో బ్రెడ్ ముక్కను కప్పి పెట్టి సర్వ్ చేసుకోవాలి.




## ఆ నొప్పి ఎందుకు?

నమస్తే మేడం. నా వయసు 28 సంవత్సరాలు. పెండ్లి కాలేదు. నెల సరి సక్రమంగానే వస్తుంది. అయితే ఇటీవల నెలసరి స్రావం దుర్వాసన వస్తున్నది. ఇదేమైనా అనారోగ్య సూచనా?

• ఓ పాఠకురాలు

జిందగీ క్లినిక్



**సాధారణంగా** నెలసరి స్రావాలు దుర్వాసన ఉండవు. మీకు కూడా ఇంతకుమునుపు లేదనే చెబుతున్నారు. ఇలా దుర్వాసన రావడం అన్నది ఇన్ఫెక్షన్ల సూచన. మీకు పెండ్లి కాలేదు అని చెబుతున్నారు కనుక ఫంగల్ లేదా, బ్యాక్టీరియల్ వెజైనోసిస్ తరహా ఇన్ఫెక్షన్ల లాంటివి ఏమైనా అయ్యే అవకాశం ఉంది. కాబట్టి ముందు డాక్టర్‌ని సంప్రదిస్తే కారణం ఏదో చెబుతారు. దాన్ని బట్టి మందులు వాడితే దుర్వాసన దూరం అవుతుంది. ఇక, మరో విషయం. మీరు మెన్‌స్ట్రువల్ హైజీన్ పాటిస్తున్నారా?... అంటే కనీసం ప్రతి ఏడెనిమిది గంటలకు లేదా స్రావాలను బట్టి ఇంకా త్వరగా ప్యాడ్‌లను మార్చుకుంటున్నారా లేదా అన్నది చూసుకోండి. నెల సరి సమయంలో సరైన పరిశుభ్రత పాటించండి. ఇది మహిళలను చాలా ఇబ్బందుల నుంచి కాపాడుతుంది.



డాక్టర్ పి. బాలాంబ
సీనియర్ గైనకాలజిస్ట్

## నమస్తే తెలంగాణ

ముల్కనూరు ప్రజా గ్రంథాలయం వారి

## ముల్కనూరు సాహితీ పీఠం

[ముల్కనూరు, భీమదేవరపల్లి (మం), హనుమకొండ జిల్లా]

సంయుక్త నిర్వహణలో




### పోటీ ప్రధాన ఉద్దేశం

సంస్కృతి, చరిత్ర, సమకాలీన జీవన వైవిధ్యాల, వైరుధ్యాల నేపథ్యంలో కథ ఉండాలి. నవ్యతకు, సృజనాత్మకతకు పెద్దపీట వేసే కథలకు మాత్రమే ఆహ్వానం పలుకుతున్నాం.

పోటీకి వచ్చిన కథలలో ఉత్తమమైన కథలను ఎంపిక చేస్తాం.

బహుమతుల వివరాలు

బహుమతి పొందిన కథలు నమస్తే తెలంగాణ 'బతుకమ్మ'లో ప్రచురితం అవుతాయి.

పది కథలను సాధారణ ప్రచురణ కోసం స్వీకరిస్తాం. ఈ కథలకు వెయ్యి రూపాయలతోపాటు, జ్ఞాపికలు అందజేస్తాం.

బహుమతి పొందిన కథలను పుస్తక రూపంలో అచ్చు వేసే అధికారం పోటీ నిర్వాహకులకు ఉంటుంది.

ప్రథమ బహుమతి (ఒక్కరికి) రూ. 50,000

2 ద్వితీయ బహుమతులు (ఒక్కొక్కరికి) రూ. 25,000

3 తృతీయ బహుమతులు (ఒక్కొక్కరికి) రూ. 10,000

6 కన్సొలేషన్ బహుమతులు (ఒక్కొక్కరికి) రూ. 5,000

### నియమ నిబంధనలు

ఇంతకు ముందు ఎక్కడా (ప్రింట్ పత్రికలలో కానీ, వెబ్ పత్రికలలో కానీ, వ్యక్తిగత బ్లాగులలో కానీ, సోషల్ మీడియాలో కానీ) ప్రచురితం కాని కథలను మాత్రమే పోటీకి పంపాలి.

ఇప్పటికే ఎక్కడైనా పరిశీలనలో ఉన్న రచనలు పోటీకి అనర్హం.

పై అంశాలను ధృవీకరిస్తూ హామీపత్రం తప్పనిసరిగా జతపరచాలి.

ప్రచురణకు అంగీకరించని రాతప్రతులను తిరిగి పంపడం సాధ్యం కాదు.

ఒకరు ఒక కథను మాత్రమే పంపాలి.

రచనకు ఏ కలం పేరు వాడినా రచయిత / రచయిత్రి అసలు పేరు తప్పనిసరిగా హామీ పత్రంలో రాయాలి.

కథ అనువాదం, అనుకరణ, అనుసరణ కాదని హామీపత్రంలో స్పష్టం చేయాలి.

పోటీలో బహుమతి పొందిన ఏ కథనైనా, ఫలితాలు వెలువడిన తరువాత వెనక్కి తీసుకునే అవకాశం రచయితలకు లేదని గమనించగలరు.

బహుమతుల విషయంలో న్యాయ నిర్ణేతలదే తుది నిర్ణయం. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు. రచయితలకు ప్రాంతీయ భేదం లేదు. ఏ రాష్ట్రమైనా, ఏ దేశంలో ఉన్న తెలుగు వారైనా కథలు పంపవచ్చు.

### పంపాల్సిన విధానం

- రాత ప్రతి అయితే కథ 12 పేజీలు మించకుండా ఉండాలి. పదాల్లో అయితే 1500 పదాలకు మించకూడదు. **ఈ పరిధిని దాటితే, పరిశీలనకు స్వీకరించబడవు.**
- ఈ-మెయిల్ ద్వారా పంపేవారు యూనికోడ్‌లో వర్డ్‌ఫైల్ పంపవచ్చు. దాన్ని పీడీఎఫ్‌లోకి కూడా మార్చి ఎటాచ్ చేయాలి.
- పేజ్‌మేకర్‌లో డీటీపీ చేయించి కథను పంపేవారు యూనికోడ్ ఫైల్‌ను, పీడీఎఫ్‌ను కూడా జతచేసి ఆ రెండిటినీ ఈ-మెయిల్‌లో ఎటాచ్ చేసి పంపాలి.
- కథలను ఆన్‌లైన్‌లో పంపేవారు దిగువ తెలిపిన ఐడీకి మాత్రమే మెయిల్ చేయాలి.
- కథల ప్రతులపై రచయిత/రచయిత్రి పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంపై మాత్రమే పేరు, ఫోన్ నంబరు, ఈ-మెయిల్ ఐడీ రాయాలి.

ముల్కనూరు లేదా హైదరాబాద్‌లో బహుమతుల ప్రదాన కార్యక్రమం ఉంటుంది.

కథల పోటీ ఫలితాలు 'నమస్తే తెలంగాణ' బతుకమ్మలో ప్రచురితం అవుతాయి.

కథలు పంపాల్సిన చిరునామా

బతుకమ్మ కథలపోటీ, నమస్తే తెలంగాణ
# 8-2-603/1/7, 8, 9, రోడ్ నంబర్ 10,
బంజారాహిల్స్, హైదరాబాద్ – 500 034.
ఈ -మెయిల్ ఐడీ
ntmulkanoorkatha2024@gmail.com

కథలు మాకు అందాల్సిన చివరి తేదీ ఫిబ్రవరి 29, 2024